క్లుప్తంగా

అంకితభావాన్ని ప్రోత్సహించేందుకే పదోన్నతులు



నవీపేట: విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రోత్సహించేందుకు పదోన్నతులు రెట్టింపు ఉత్సాహాన్ని అందిస్తాయని సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు. సీఐగా పదోన్నతి పొందిన ఎస్సై రాజారెడ్డిని జనవికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదోన్నతులు ఆశించకుండా అంకితభావాన్ని అలవర్చుకుంటే సమాజంలో పేరు ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, మాజీ ఎంపీపీ సూరిబాబు, నాయకులు రాంరెడ్డి, గంగాధర్, దేవరాజ్, రామకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

వైటల్ విద్యా వర్క్‌షాప్



బోధన్‌టౌన్(బోధన్): లయన్స్ ఇంటర్నెషనల్ డిస్ట్రిక్ 320 ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని విశ్వనాథ్ గార్డెన్స్‌లో వైటల్ విద్యా వర్క్‌షాప్ తరగతులు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు డిస్ట్రిక్ చైర్మన్లు హాజరయ్యారు. డిస్ట్రిక్ చైర్మన్లకు సేవా కార్యక్రమాల నిర్వహణపై వివరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన డిస్ట్రిక్ చైర్మన్‌లకు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, చైర్మన్ నాగరాజు, డిస్ట్రిక్ 320 గవర్నర్ లక్ష్మి, కోశాధికారి కోడాలి కిశోర్ కుమార్, ప్రతినిధులు లయన్ బసవేశ్వర్‌రావు, సూర్యనారాయణ, డిస్ట్రిక్ చైర్మన్ జ్యోతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల శ్రమదానం

నవీపేట: మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పడిన గుంతలను బీజేపీ నాయకులు ఆదివారం శ్రమదానం చేసి పూడ్చారు. బాసర రహదారిపై ప్రమాదకరంగా మారిన ఈ గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బీజేపీ నాయకులు గంగోని రాము, గణేష్, రాజేందర్‌గౌడ్‌లు మొరంతో పూడ్చారు.

రుణమాఫీ ఏకకాలంలో చేయాలి



ఆర్మూర్: ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికి లక్ష రుణమాఫీని ఏకకాలంలో చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాం అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నూతన రుణాలు అందించాలని, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇటీవలే కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు రూ. 10వేలు ఇస్తామన్నా మాట నీళ్ల మూటయిందని ఎద్దేవా చేశారు. వాణిజ్య పంటకు రూ.లక్ష, ఇతర పంటలకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి పంటకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 22న జిల్లాలో, అన్ని మండలాల్లో జేడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, మల్లన్న పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో మురికి కాలువలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థానిక కౌన్సిలర్ సంవత్సరం క్రితం డ్రైనేజీ నిర్మిస్తానని చెప్పి ఇప్పటి వరకు నిర్మించకపోవడంతో స్థానికుడు అయిన ఖాందేశ్ ప్రశాంత్ మురికి కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. మురికి కాలువ నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ఈ సందర్భంగా స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రజాసంఘాల నేతలపై అక్రమ కేసులు ఎత్తేయాలి



మోర్తాడ్: ప్రజల సమస్యలపై, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రజా సంఘాల నాయకులపై రాజద్రోహం కేసులను నమోదు చేసి వేధించడం సరికాదని అఖిల భారతీయ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్‌పైన కేసు ఎత్తివేసినట్లుగానే ఇతర ప్రజా సంఘాల నాయకులపై కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం భాస్కర్ మోర్తాడ్‌లో మాట్లాడారు. రాజద్రోహం కేసులను నమోదు చేసి ఉద్యమాలను అణచివేయాలని చూడటం అవివేకం అన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు



బజార్ కొత్తూర్, ఉమ్మెడ గ్రామాల వద్ద ఉన్న మూల మలుపు

- సూచిక బోర్డులు కరువు
- ఇరుపక్కలా ఏపుగా పెరిగిన చెట్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు

నందిపేట్(ఆర్మూర్) : మండలంలోని పలు గ్రామాల్లో మూల మలుపులు ప్రమాదాలకు నిలయమవుతున్నాయి. రూ.కోట్ల ఖర్చు రోడ్డు వేసినా ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం మరిచారు. రోడ్లన్నీ గుంతలు లేకుండా అద్దంలా ఉండడంతో వాహనాలు రయ్యున దూసుకుపోతున్నాయి. మూల మలుపుల వద్ద రోడ్డుకు ఇరుపక్కలా చెట్లు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో వాహన దారులు తికమక పడుతున్నారు. రాత్రుల్లో మరీ ఇబ్బందికరంగా మారింది. వాహనాల లైట్లకు ఎదురుగా వస్తున్న వాహనాలు తెలియడం లేదు. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బజార్ కొత్తూర్, ఉమ్మెడ, బాద్గుణ, లక్కంపల్లి, సీహెచ్ కొండూర్ గ్రామాల సమీపంలో ప్రమాదకరంగా మూలుమలుపులు ఉన్నాయి. పెద్ద ప్రమాదం జరగకముందే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రుల్లో ఇబ్బందిగా ఉంది



రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంది. మూల మలుపుల వద్ద రోడ్డు కనిపించకపోవడంతో స్లిప్ అయి పడిపోయే ఆస్కారం ఉంది. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాల స్పీడ్ తగ్గించే ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులను కచ్చితంగా ఏర్పాటు చేయాలి.

– పిప్పెర సాయరెడ్డి, తల్వేద

అధికారులు త్వరగా స్పందించాలి



పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులు మూల మలుపుల విషయంతో త్వరగా స్పందించాలి. ఏళ్లుగా ఇలాగే ఉన్నా స్పందించడం లేదు. ఉమ్మెడ రోడ్డుకు ఎన్నో మలుపులు ఉన్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చెట్లు, పొదలు తొలగించడం వంటి చర్యలు చేపట్టాలి.

– లోకేందర్, బాద్గుణ



బాద్గుణ సమీపంలో..



లక్కంపల్లి గ్రామం వద్ద..



సీహెచ్ కొండూర్ గ్రామ సమీపంలో..

మిషన్ భగీరథతో ఇంటింటికి జలాలు



అర్గుల్‌లో మిషన్ భగీరథ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు



చిన్నాపూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి రక్షిత జలాలను అందజేస్తూ తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్ ప్రజల పాలిట దేవుడని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో గల మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ఆదివారం మంచి నీళ్ల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రూ.42 వేల కోట్ల వ్యయంతో కృష్ణ, గోదావరి నదులు, ఇతర జలాశయాల ఆధారంగా రాష్ట్రంలోని 24 వేల గ్రామాలు, 65 పట్టణాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.450 కోట్లతో 317 కిలో మీటర్ల మేర పైపులైను ఏర్పాటు చేసి 88 ఓవర్ హెడ్ ట్యాంకులతో మంచి నీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న తనను ప్రజలు గెలిపించి హ్యాట్రిక్ విజయం సాధించిపెట్టాలని ఈ సందర్భంగా అభ్యర్థించారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, వైస్ చైర్మన్ రజిత యాదవ్, జెడ్పీ సీఈవో గోవింద్, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్ను బాయ్, ఎంపీపీ పస్క నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

మాక్లూర్: గ్రామాల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమైందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురంలో భాగంగా ఆదివారం చిన్నాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఉమ్మడి రాష్ట్రాన్ని ఎన్నో ప్రభుత్వాలు పాలించినప్పటికి గ్రామాల్లో తాగునీరు, సాగు నీరు లేదన్నారు. కరెంటు ఎప్పుడు వస్తదో రాదో తెలియక రైతులు కష్టాలు పడేవారన్నారు. కేసీఆర్ పుణ్యమా అని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ఇంటింటికి తాగునీరు అందిస్తూ వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్‌తో పాటు సాగు నీరు అందుతుందన్నారు. ఎంపీపీ ప్రభాకర్, అమ్రాద్ విండో చైర్మన్ శ్రీనువాస్‌గౌడ్, స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సత్యనారాయణ, సత్యం పాల్గొన్నారు.

నేను బీఆర్ఎస్‌లో చేరలేదు

తాను బీఆర్ఎస్‌లో చేరలేదని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరులు బలవంతంగా లాగి మెడలో బీఆర్ఎస్ కండువా వేశారని చిన్నాపూర్‌కు చెందిన పుప్పాల చిన్నా వెల్లడించారు. తాను పక్కా బీజేపీ వ్యక్తినని, బ్రతికి ఉన్నంత కాలం బీజేపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని 50 వేల మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

బీజేపీ నేతకు పరామర్శ

ఆర్మూర్‌టౌన్: బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డికి తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తుండగా చేతికి గాయమైంది. వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తుండగా చేతికి గాజు ముక్క కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించి చికిత్స చేయించారు. ఆయనను పలువురు బీజేపీ నాయకులు ఆదివారం పరామర్శించారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



పెగడాపల్లిలో క్విజ్ పోస్టర్లను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్‌లో..

బోధన్‌రూరల్(బోధన్): రానున్నల్లో ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై ఆదివారం పెగడాపల్లి విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించి, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్విజ్‌లో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో జులై 2నక్విజ్ పోటీల్లో భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



బోధన్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ, నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి జైల్లో పెడతారా.. ఇది ప్రజాస్వామ్యమా, రాచరికమా అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దిన్ ప్రశ్నించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పట్టణంలోని పర్యటిస్తున్న ఎమ్మెల్యేను కాలనీ వాసులు, ఎంఐఎం నాయకులు నవీద్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యక్తిగత రుణాలు ఎవరికైనా ఇచ్చారా అని అడిగారని, దీంతో ఎమ్మెల్యే పోలీసులను అడ్డం పెట్టుకొని కేసులు నమోదు చేయిస్తున్నారని అన్నారు. ప్రజలు అభివృద్ధిపై అడగకుండా భయభ్రాంతులకు గురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీయూలో అక్రమాలపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న అనిల్ కుమార్

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై, వీసీ రవీందర్ గుప్తా అక్రమాలపై, అక్రమ నియామకాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనిల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విజిలెన్స్, ఏసీబీ దాడులు చేసినా ఎలాంటి చర్యలు లేకుండా నామమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే సీఎం కేసీఆర్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరు చేయాలని లేని పక్షంలో జిల్లాకు వస్తే అడ్డుకుంటామన్నారు. నవీన్, ఆకాష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు



పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: బీఆర్ఎస్ పాలకులు అభివృద్ధి పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం చిట్టాపూర్‌లో కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సఫాయి సాయన్న కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సఫాయి సాయన్న కుటుంబ సభ్యులు నివాస ఉంటున్న ఇంటిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. నియోజక వర్గంలోనే గృహ నిర్మాణ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఉన్నా పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందకపోవడం శోచనీయమన్నారు. కమీషన్లు ఇచ్చే పనులను మాత్రమే మంత్రి పట్టించుకుంటాడని విమర్శించారు.

సమాచారం..

నేడు తానాకలాన్‌కు ఎమ్మెల్యే రాక

ఎడపల్లి(బోధన్): దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎడపల్లి మండలం తానాకలాన్ గ్రామంలో నిర్వహించే హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే షకీల్ పాల్గొంటారని సర్పంచ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇరిగేషన్ ఆధ్వర్యంలో అలీసాగర్ పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కేజీబీవీలో అటెండర్ కావాలి

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టు భర్తీకి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శాంత కుమారి తెలిపారు. అనుభవం ఉన్నవారు ఈనెల 19 నుంచి 21లోగా కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఘనంగా మంచి నీళ్ల పండుగ

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఘనంగా మంచి నీళ్ల పండుగలను నిర్వహించారు. మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకుల వద్ద మామిడి తోరణాలు కట్టి పూజలు చేశారు. అనంతరం ర్యాలీలు తీశారు. ప్రతి ఇంటికి నల్లా ద్వారా నీటిని సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్‌ది అని స్థానిక ప్రజాప్రతినిధులు అన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జలాల్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్



ఎడపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బాల్కొండలో..



పచ్చలనడ్కుడలో ..



సుర్బిర్యాల్‌లో..



మారంపల్లిలో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ..

పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలి

బాల్కొండ: మండల కేంద్రంలోని పూలే బీసీ బాలికల పాఠశాల భవనంపై నుంచి విద్యార్థి బ్లెస్సీ దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనకు పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ శేఖర్ ఆదివారం డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల పాఠశాలలో ఉపాధ్యాయులు తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనేక మంది విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లారన్నారు. వేధిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఓటరుకార్డు నమోదు చేసుకోవాలి

వేల్పూర్: 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు వచ్చేనెల 1లోపు ఓటరుకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని వేల్పూర్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మొండి అశోక్ ఆదివారం తెలిపారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ అర్హులైన వారికి ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చిందన్నారు. అదే విధంగా ఓటరు కార్డు ఉండి సాంకేతిక కారణాల వల్ల ఓటరు లిస్టులో పేరు లేని వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

‘నిధులు మంజూరు చేయాలి’



డొంకేశ్వర్(ఆర్మూర్): దత్తాత్రేయ గుడి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ డొంకేశ్వర్ మండలం మారంపల్లికి చెందిన దత్త ఆశ్రమ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ అర్గుల రవి పాల్గొన్నారు.

డీవీకే వర్ధంతి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బోధన్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అమరుడు డి.వెంకట కృష్ణ(డీవీకే) ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న స్మారకోపన్యాస సదస్సు వాల్ పోస్టర్లను ఆదివారం పట్టణ కేంద్రంలోని గ్రామ చావిడి వద్ద పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేశ్ మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన డీవీకే బలమైన విప్లవోద్యమ నిర్మాణం కోసం జీవితాంతం అలుపెరుగకుండా కృషి చేసిన త్యాగశీలి, ఆదర్శ కమ్యూనిస్టునాయకుడని కొనియాడారు. నాయకులు పడాల శంకర్, నాగమణి, బీపాషా బేగం, గంగారాం పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) – 3.10
ది ఫ్లాష్ – 12.00, 6.55, 10.05

స్క్రీన్-2 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00

స్క్రీన్-3 – ఆదిపురుష్ (2డీ-తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45

స్క్రీన్-4 – ఆదిపురుష్ (2డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

మాల మహానాడు పట్టణ నూతన కమిటీ ఎన్నిక



బోధన్: మాల మహానాడు పట్టణ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బత్తుల కిష్టయ్య, నిజామాబాద్ నగర కోశాధికారి సిద్దం రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా రేకం దాసు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మిర్జాపురం బాల్‌రాజ్, ఉపాధ్యక్షులుగా సంజీవ్, ప్రమోద్, స్వామి, ప్రధాన కార్యదర్శిగా తలారి నవీన్, సహాయ కార్యదర్శులుగా భూమయ్య, పత్తి అశోక్, సంజీవ్, కిషోర్, గంగాధర్, పల్లాటి యాదగిరి, కోశాధికారిగా కారం స్వామి, ముఖ్య సలహాదారుడిగా పెరిక రామక్రిష్ణలను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య వెల్లడించారు.